# ప్రేమ

- అరుణ బొమ్మారెడ్డి

బస్సు ఆగుతూ, ఆగుతూ నెమ్మదిగా వెళదామా వద్దా అన్నట్టు వెళ్తోంది. అరుణ మనసులో ఆలోచనలు మాత్రం శతాబ్ది ఎక్స్‌ప్రెస్‌తో పోటీపడుతూ ఎటు వెళుతున్నాయో తెలీకుండా వున్నాయి. నిన్న మొన్నటి వరకు కలలుకన్న సాహితీ ప్రపంచం, తరువాత అనూహ్య పరిస్థితులలో జరిగిన విద్యార్థి ఉద్యమం... ఒకటేమిటి ఏవేవో ఆలోచనలు వేగంగా సాగిపోతున్నాయి.

అన్నివైపులా నిరుత్సాహం, విఫల ప్రేమ, అసంపూర్తిగా మిగిలిన ఉద్యమం, చదువుకు సరిపడని ఉద్యోగం, ఇలా నిరాశ మాత్రమే జీవితమంతా దట్టంగా ఆవరించినట్టు, తను దాని మధ్య నుంచి వెళుతున్నట్టు ఊహించుకుని బాధపడటం అరుణ జీవితంలో ఒక భాగంగా మారిపోయింది.

జీవితం గురించి ప్రశ్నలెలా వున్నా, సర్కారు వారిచ్చిన నౌకరీని చేతబట్టుకుని ఇంత దూరం పల్లె, పట్టణం కాని చోటుకు రావలసి వచ్చింది.

చదువుకున్న చదువేమిటి? చేస్తున్న ఉద్యోగమేమిటి? పెద్ద నిట్టూర్పు. జీవితానికి అర్థాలు వెతుక్కుని, విపరీతంగా అలసిపోయి, అర్థాలు అనవసరం, అవసరాలు మాత్రం తీరితే చాలునని రాజీపడుతూ, లేస్తూ... కిటికీలోంచి బయటకు చూస్తూ కూర్చుంది అరుణ. పక్కన ఏదో అలికిడి అయి ఇటు తిరిగి చూసింది. ఒక చిన్న అమ్మాయి పెద్ద పుస్తకాల సంచీతో, ఓ మోస్తరుగా మాసిపోయిన స్కూల్ యూనిఫామ్, దుమ్ము కొట్టుకున్న ముఖం, జుట్టు... ఇపుడిపుడే పల్లెల్లో క్కూడా మల్టీనేషనల్ మోడల్ స్కూలు బ్యాగులు.

అడ్వర్టయిజ్‌మెంటు లాంటి బ్యాగు, అచ్చంగా, నిజంలాంటి బట్టలూ, మనిషీ.

చిన్నగా నవ్వి, జరిగి కూర్చుని ఆ అమ్మాయికి చోటు చూపింది.

సిగ్గుపడుతూ, బెరుకుగా మళ్లీ మళ్లీ అరుణ వైపు చూస్తూ-

'మీరు టీచరా?' అని అడిగింది.

అవునో, కాదో మరి. 'లెక్చరర్' అని చెపుదామనుకుంది. చిన్నపిల్లకు అర్థం కాదనుకుని, అతికష్టం మీద ఓ నిట్టూర్పు విడుస్తూ 'అవున'ంది- హైదరాబాద్‌లోని ఓ పెద్ద యూనివర్శిటీలో పిహెచ్.డి. చేస్తున్న మాట ముల్లులా గుచ్చుతుంటే.

'అహం' మరి ఊరికే పోదు కదా అని తనను తాను నిమ్మళించుకుంది.

'నీ పేరేమిటమ్మా?' అని నెమ్మదిగా ఆ పిల్లని మాటల్లో పెట్టింది.

'ఊఁ అనూష' అని ముద్దుగా బదులిచ్చింది.

'ఈ పేరింతవరకూ వినలేదే, ఏదో కొత్త పేరులా వుంది'

ఉష అంటే వెలుగు. మరి అనూష అంటే ఏమిటో అని మనసులో అనుకుంది. ఇంటికెళ్లి డిక్షనరీ చూడాలి అనుకుంది.

ఇదివరకటి బిడియం, జంకు అన్నీ మరిచిపోయి మాట్లాడసాగింది అనూష. స్కూలు నుంచి ఇంటికి వెళుతోంది. పప్పూరు నుంచి చాగల్లు, ఉల్లికల్లు మీదుగా అనంతపూర్‌కు వెళ్లే బస్సు మాత్రమే ఇల్లు చేరడానికి ఏకైక సాధనం. స్కూలు ఏ నాలుగ్గంటలకో ముగిస్తే, ఓ గంటసేపు బస్సు కోసం ఎదురుచూపులు, మరో గంటసేపు బస్సులో పిక్నిక్. ఇదంతా ఈ నాలుగు మైళ్ల దూరానికే.


'మీదేవూరు?'

'జూలాకాలవ'

'నాన్నేమి పని చేస్తాడు?'

'సేద్దెం. మాకు అరెకరం పొలం వుంది.'

వ్యవసాయం వున్న మాట వినగానే ఫర్వాలేదనుకుంది. తరువాత జాలిపడింది. రాయలసీమ రైతులు వర్షాలు లేక, వ్యవసాయం గిట్టుబాటు కాక, కొంతమంది టౌను చేరుతుంటే, మిగిలినవారు మాత్రం టౌనులోనూ, పల్లెలోనూ ఏం పనిచేయాలో దిక్కుతోచక ఆత్మహత్యలు చేసుకుంటున్న రోజులివి. కానీ ఈ తాడిపత్రి ప్రాంతం పరిస్థితి కొంత నయం. ఇక్కడి రైతులు




పండ్ల తోటలు పెట్టి, మిగిలిన రాయలసీమ రైతులకంటే మెరుగ్గా వున్నట్టనిపిస్తారు.

కాస్సేపాగి మళ్లీ అనూషనే అందుకుంది.

'నాకు ఇద్దరు అక్కలూ, ఒక తమ్ముడూ వున్నారు.'

నలుగురు పిల్లలు. ఈ జూలాకాలవ సామ్రాజ్యాధిపతి, ఫలానా మహారాజుకు వారసుడు కావాలి. ఏమి పెట్టి పోషిస్తారు ఇంతమంది పిల్లలని అని మనసులో విసుక్కుంది అరుణ.

బస్సెక్కడో ఆగినట్టుంది. ఇక ఇక్కడ నుంచి కదిలేటప్పటికి దేవుడు దిగి వస్తాడు. మార్కెట్‌కు తరలించే జామకాయలు, రేగుకాయలు వంటి పండ్ల సంచీలతో బస్సు మొత్తం నింపేస్తే కానీ కండక్టరుకు గిట్టుబాటు కాదు. ఎటు చూసినా జామకాయ బస్తాలే. బస్సు పైనా, అడ్డంగా, నిలువునా, ప్రక్కనా.

ఆ అమ్మాయి మాటలూ, మాట తీరూ అరుణకు ఎంతో ఆశ్చర్యాన్ని కలిగించి ముద్దొస్తోంది. అందుకే ఆసక్తిగా వింటోంది.

'మా ఇంట్లో మా సిన్నత్త కూడా వుంది. ఆయమ్మకి నీ వయసుంటుంది. పెళ్లయింది. అయినా మా ఇంట్లోనే వుంది. ఆయమ్మే వంటసేస్తుంది' అని చెపుతూ పోతోంది.

వయసును బట్టి మనుషులను జతకట్టగలిగిన ఆ పిల్ల ఆరిందాతనానికి అరుణ ఆశ్చర్యపోతూ—

'వాళ్లిల్లు మీ ఇంటికి దగ్గరా?' అంది ఇంకేమడగాలో తెలీక.

'కాదు. మా మామ సనిపోయినాడు. అందుకే మా నాయన మా ఇంట్లోనే వుండమన్నాడు.'

'నువ్వెన్నో క్లాసు?' అపుడే గుర్తొచ్చినట్టు అడిగింది.

'నాలుగు' బదులు చెప్పి, కిటికీలో ఎవరో

ఫ్రెండు కనిపిస్తే-

'ఏయ్ పాప్ప స్కూలుకి రాలేదు' అని పక్క పల్లె ఫ్రెండుని పరామర్శించింది.

'జ్వరం' అని అటువైపు నుంచి బదులు.

'దాని జోలికెందుకు పోయినావు పా' అని జోకు వేసింది.

ఆ పిల్ల మాటలు వింటున్నకొద్దీ ఆశ్చర్యం వేస్తోంది అరుణకు. ఒక నిముషం విషాదం, మరు నిముషం ఉత్సాహం అన్నీ కలగలిపి మానవత్వానికి ప్రతీకగా వున్నట్టనిపించింది ఆ ఎనిమిదేళ్ల చిన్న పాప. ప్రభుత్వం అడుగడుగునా స్కూళ్లు పెట్టి అభివృద్ధి అంటోంది. పల్లె పిల్లలకు ఇంట్లో చదువుకోమని చెప్పే దిక్కెవరు? ఇంట్లో కష్టాలన్నీ వీళ్లకు తెలుసు. ఆ బాధలో వీరు భాగస్వాములు కూడాను. ప్రస్తుత పరిస్థితులలో చదువు మామూలుగా రాదు. అలాంటప్పుడు ఈ పేదరికం, కష్టాలు, నిరాదరణ మధ్య చదువుకుని, పెరిగి పెద్దవాళ్లయి, పట్నం పిల్లలతో పోటీపడాలి. అది సాధ్యమా? పట్టణంలో ఆ వయసు పిల్లలకు కనీసం వారు తినే తిండి ఎటునుంచి వస్తుందో, దాన్ని ఏమంటారో, ఎలా పండిస్తారో ఏమీ తెలీదు. తల్లిదండ్రులు తెచ్చిపెడితే తిని, కాలు కదపకుండా స్కూలూ, ట్యూషన్లూ... సమస్తమూ. మరిక ఉద్యోగాలెవరికొస్తాయి వీరికి కాకపోతే?

బస్సు మళ్లీ కదులుతోంది. స్కూలు పిల్లలందరూ ఉత్సాహంగా జామకాయ బస్తాలున్నచోట చేరి కాయలు కాజేయడానికి ప్లాను వేసుకుంటూ, దొరికిన వాటిని వెంటనే బ్యాగులో వేసుకుంటున్నారు.

అరుణ కొలీగ్స్ ఒక బుట్ట కాయలు బస్సులోనే కొని అరుణకు కొన్ని ఇచ్చారు. అవి తీసి బ్యాగులో వేసుకుంటుంటే జామకాయల రైతొకాయన, 'ఏమ్మా... మా కాయలు తీసి బ్యాగులో వేసుకుంటే ఎట్లా?' అంటున్నాడు. చికాకుగా చూసి, సమాధానం చెబుదామనుకునేలోపే 'లేదు కొనుక్కుంది' అని ఎవరో సమాధానమిచ్చారు.

జామకాయ ఒకటి తీసి అనూషకిచ్చింది.

'వొద్దం'టూ సిగ్గుపడుతూనే తీసుకుంది.

❖ ❖ ❖

బస్సు రెండు కొండల నడుమ పొలాల మధ్యలోంచి వెళుతోంది. ఏ ఊరు వస్తోందో, ఏ ఊరు వెళుతోందో అరుణకేమాత్రం ఎరుకలేదు. కిటికీలో నుంచి పైరగాలి వచ్చి చల్లగా తగులుతోంది. మనసులోని బాధంతా ఒక్కసారి తీసివేసినట్టనిపించి హాయిగా గాలి పీల్చుకుంది అరుణ.

అనూష, అరుణ ఇక మిగిలిందేమిటన్నట్టు నిశ్శబ్దంగా వుండిపోయారు. బుర్ర తొలిచివేసే ఆలోచనలు మళ్లీ వేయున్నామంటూ ముసురుకున్నాయి.

ఏం కావాలీ మనుషులకీ? కాసింత ప్రేమను పంచి ఇవ్వలేరు. ప్రక్క వాళ్లను అర్థం చేసుకోరు.

నాలుగేళ్లు ప్రేమో, స్నేహమో తెలీక చివరకు చేతులెత్తేసి, కులం, గోత్రం, జీతం అన్నీ అనుకూలంగా వున్న అమ్మాయిని పెళ్లి చేసుకోవడానికి సిద్ధపడ్డ ప్రసాద్‌ని తలుచుకుంటూ అనుకుంది.

ఒక్క ప్రసాదేమిటి? ప్రపంచం మొత్తం ప్రేమ రాహిత్యంతో బాధపడుతున్నట్టుంది. ప్రేమ లేకనే ఈ బాధలన్నీ. ఎటు చూసినా స్వార్థం, కుళ్లు... ప్రతి వ్యవస్థా, కుటుంబం కానీ, విద్యా సంస్థలు కానీ, స్నేహం కానీ కుళ్లు, స్వార్థం మీదనే గట్టి పునాదులు వేసుకుని నిలబడుతున్నాయి.

కాలేజీ, కొలీగ్స్...

సగం మహిళలు...

విపరీతమైన జెలసీ...

పైకి కారణాలేమీ కనిపించవు.

'మాకంటే గొప్పా?' అన్న ఈసడింపు.

ఇలాంటి వారితో కాలేజీలో కాలక్షేపం.

ఇక పెళ్లి సంబంధాల బాధ.

కాస్తంత మానవత్వంతో ఆలోచిస్తే తెలుస్తుంది పెళ్లిచూపులు ఎంత దారుణమైన పద్ధతో. ఇద్దరు వ్యక్తులు పెళ్లిచేసుకోవడానికి ఒక ఊరు, పేరు తెలియాలి. ఒక అభిప్రాయం తెలియాలి. కష్టనష్టాలు తెలియాలి. అంతేకానీ, కట్నాలూ, టౌనులో ఉద్యోగాలూ, ట్రాన్స్‌ఫర్లూ... ఇంకేవేవో... అదో రకం ప్రేమ రాహిత్యం, అమానుషం... అంతా కలిపి ఓ పెద్ద నరకం.

❖ ❖ ❖

బస్సులో ఏదో అలజడి. ఏదో ఊరు

వచ్చినట్టుంది. పిల్లలంతా కలకలమంటూ బ్యాగులు మోయలేక మోస్తూ బస్సులోంచి బయటపడడానికి ప్రయత్నిస్తున్నారు.

'అనూష'

అర్థం తెలీని అనూష.

ఇంకా అలాగే సిగ్గుపడుతూ, నవ్వుతూ చూస్తూ, తనూ బయలుదేరడానికి లేచి నిల్చుంది.

'అపుడే మీ ఊరొచ్చిందా?'

'ఊఁ జూలాకాలవ' అంటూ చేయి చాచింది.

అరె, ఆశ్చర్యం. ఇదివరకు రెండో జామకాయ ఇస్తే వద్దన్నది. ఇపుడు ధైర్యం వచ్చింది కాబోలుననుకుంటూ, మనసులో ఎక్కడో ఏదో ఇదివరకు నిర్మించుకున్న ఆనందభవనం కూలిపోతున్నట్టు అనిపిస్తున్నా పట్టించుకోకుండా-

'అంతే మరి, పాపం తిండికి లేక జామకాయ కోసం చేయి చాచింద'నుకుని కాయ చేతిలో పెట్టబోయింది.

'ఊహూఁ కాదు, షేక్‌హ్యాండ్' అంటూ అరుణ చేయి అందుకుంది ఓ గంటసేపు చేసిన స్నేహానికి గుర్తుగా.

అరుణ ఒక్కసారిగా తన అంచనా తారుమారయినందుకు సిగ్గుపడాలో, ఏమనాలో తోచక ఉక్కిరిబిక్కిరవుతూ ఆ పిల్ల ప్రేమ కానుక నందుకుంది.

ప్రపంచం మరిచిపోయిన ప్రేమ, స్నేహం, మానవత్వం కళ్లముందు నిలబడినట్టనిపించి కళ్లనిండా నీళ్లు...

'అనూష అంటే?' వెదకబోయిన తీగ కాలికి తగిలినట్టయింది.

'అంటే... ప్రేమ' అని డిక్షనరీ చీకట్లోంచి చెబుతున్నట్టనిపించింది.

బస్సు మాత్రం చీకటి లోయలో నుంచి బయటపడటానికి ప్రయత్నిస్తూ ముందుకు వెళుతోంది. ●


# మోనికా బుక్స్

**తెలుగు వెలుగులు**
(75 మంది ప్రముఖుల పదచిత్రాలు-బాపు బొమ్మలతో)
వెల 85 రూపాయలు

**కథా పత్రిక**
(20 కథల సంపుటి)
వెల 60 రూపాయలు

**ఐ.వి.ఆర్.-రాజసూయం**
(ఉలుకు-పలుకు వ్యాసాల సంకలనం)
వెల 75 రూపాయలు

**ఒకే ఒక్కడు**
(ఎన్.టి.ఆర్. జీవితకథ)
వెల 150 రూపాయలు

**విశ్వవిహారం**
(యాత్రా రచన)
వెల 60 రూపాయలు

విశాలాంధ్ర బుక్‌హౌస్‌తో సహా ప్రముఖ పుస్తకాల షాపులలో ఇవి లభిస్తాయి. పోస్టు ద్వారా తెప్పించుకోదలచిన పాఠక మిత్రులు పుస్తకం విలువను ఎం.ఓ. లేదా డి.డి. రూపంలో ఈ క్రింది అడ్రసుకు పంపండి. పోస్టేజి ఉచితం.

—— మోనికా బుక్స్ ——
ప్లాట్ నెం.103, రోడ్ నెం.71, నవనిర్మాణ్ నగర్, జూబ్లీహిల్స్, హైదరాబాద్-500 033